యూనిట్ IV

# 12. బతుకు పుస్తకం

- సావిత్రి

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

పుస్తకాలకు రెక్కలుండవు. కాని వాటిని చదివితే మనకు ఎన్నెన్నో రెక్కలు మొలచినట్లుగా ఉంటుంది. ఆ రెక్కలు జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని, సృజనాత్మకతా నైపుణ్యాన్ని, లోకపరిశీలనాదృష్టిని కలిగిస్తాయి. ఏది మంచి పుస్తకం, ఏ పుస్తకాన్ని చదవాలనే ఎంపికలో పుస్తక పరిచయ వాక్యాలు మార్గదర్శనం చేస్తాయి.

### ప్రశ్నలు

1. ఈ పేరా ఏ విషయాన్ని తెలుపుతుంది?
2. పుస్తకాలు చదవడంవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?
3. 'ఏదైనా పుస్తకాన్ని చదవాలి' అనే ఆసక్తిని కలిగించే అంశమేది?
4. మీరు ఏ పుస్తకాన్ని ఐనా చదవడానికి ముందు ఏం చేస్తారు?
5. ఏదైనా పుస్తకాన్ని చదవాలనే కోరిక మీకు ఎలా కలుగుతుంది?

© SCERT not to be republished

**ఉద్దేశం :**

పుస్తక పరిచయంలో ఒక్కొక్కరిదీ ఒక్కోవిధం. రచయిత్రి 'బతుకుపుస్తకం' పుస్తకం మీద ఏర్పరచుకున్న ప్రత్యేకాభిమానం ఈ రచనలో తెలుస్తుంది. పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయడాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం 'సావిత్రి' సమగ్ర రచనా సంపుటి లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

ఉప్పల లక్ష్మణరావుగారి 'బతుకు పుస్తకం' చదవడానికెన్నో ఏళ్ళుముందుగానే – అంటే, వారి "అతడు–ఆమె" చదివినప్పుడే ఒక విశిష్ట వ్యక్తిత్వమేదో ఆయన సాధించి ఉంటారనిపించింది.

సమాజానికి లక్ష్మణరావుగారి వంటి నిజాయితీగల సాహితీమూర్తుల ఆవిర్భావం ఒక చారిత్రక అవసరం అనే చెప్పాలి. వారి "అతడు–ఆమె" చదివినప్పుడు దశాబ్దాల తరబడీ నాలో పేరుకుపోయిన నీరసం పటాపంచలై ఎక్కడలేని ఉత్సాహమూ పుట్టుకొచ్చింది. తనతో సమంగా ప్రతిఒక్కరూ జీవించాలనే సదాశయంగల వ్యక్తి తప్పించి మరొకరు రాయలేరా పుస్తకం అన్పించింది. 'బతుకు పుస్తకం' నా ఆశ నిజమేనని నిరూపించింది. 'అతడు – ఆమె' వంటి పుస్తకం రాయగలిగే అర్హత వారికే వున్నదని నిరూపించిందీ బతుకు పుస్తకం.

"అతడు ఆమె" లోని "ఆమె" కి ఆధారం లక్ష్మణరావుగారి జీవితమంతా అత్యంత హుందాగా తన వ్యక్తిత్వాన్ని పరచిన స్విట్జర్లాండు మహిళ – వారి జీవిత భాగస్వామి – మెల్లీ ! నిజంగా "మెల్లి" ఈ దేశంలో పుట్టకపోతేనేం?– మన తెలుగువాడి ఇల్లాలిగా, ఆమె మనదేశాన్ని ప్రేమించి ఈ దేశపు దాస్యశృంఖలాలను తెంచివేయడంకోసం స్వాతంత్ర్యోద్యమ కారిణిగా జీవించింది. ఆమెలోని తిరుగులేని వ్యక్తిత్వాన్ని చిత్రించింది. ఏ విధంగా స్త్రీ నిర్భయంగా, నిర్నిబంధంగా జీవించాలని నేనాశిస్తున్నానో అలా ఈ దేశంలోనే జీవించిన మెల్లీతో జీవితం పంచుకొన్న లక్ష్మణరావుగారినీ, వారి బతుకు పుస్తకాన్ని నేను అభిమానించడంలో ఆశ్చర్యం ఏమీలేదు కదా మరి?

ఒక గ్రంథం పఠితకివ్వాల్సిందేమిటి? జడమైన విజ్ఞానమా? వికృతమైన హాస్యమా? ఉన్మాదపు ఉత్సాహమా? చిర్రెత్తించే ఉపదేశమా? రీడబులిటీ పేర కాలక్షేపమా? ఇవేవి కావు ముమ్మాటికి!

నిరుత్సాహికి ఉత్సాహాన్నీ, రికామికి బాధ్యతనీ, అజ్ఞానికైనా, జిజ్ఞాసువుకైనా విజ్ఞానాన్నీ తగుమాత్రపు ఆర్ద్రతనూ తప్పక అందించగలగాలి పుస్తకం. "అమ్మో! ఇది మహాగ్రంథం? మనకెక్కడ అర్థమౌతుంది? అనిపించకుండా ఒక డైరీలా, ఒక నేస్తం రాసిన ఉత్తరంలా సన్నిహితంగా ఉండాలి. నాకోసమే పాపం శ్రమపడి ఇంత రాసేడు ఓపిక తెచ్చుకొని, అనిపించాలి. తన బాధేదో దాచుకోకుండా చెప్తున్నాడు. విందాం! అనిపించేంత నిరహంకారంగా, ఆత్మీయంగా ఉండాలి. చదువుతున్నంత సేపూ ఎంత చక్కని విషయాలు తెలుసుకుంటున్నామో అనే హాయి కలగాలి. చదివిన తర్వాత "నయం" ఇన్నాళ్ళకైనా దీన్ని చదవగలిగాను" – అనిపించాలి. విషయం క్లిష్టమైనా వివరణ స్పష్టంగా వుండాలి. ఏదో ఓ కొత్త విషయం చెప్పాలి. ఎంతో కొంత కార్యశీలత రేపాలి, కదపాలి, కుదపాలి, మంచిదారి చూపాలి. మనశ్శాంతి కలిగించాలి.

నేనైతే ఇంత చెప్పాను కాని లక్ష్మణరావుగారి తల్లిగారైతే – నాటి ఆచారం ప్రకారం ఐదవ తరగతైనా చదివారో లేదో గాని తమ తండ్రిగారి నిరంతర కృషివల్ల చక్కని విమర్శకురాలిగా తయారయారు. లక్ష్మణరావుగారు తొలుత రాసిన 'అతడు –ఆమె' పుస్తకంగా ప్రచురిస్తూ బైండుచేయించడానికి ముందు అచ్చు ప్రతిని వాళ్ళమ్మగారికి, పినతల్లులకూ ఇచ్చారట. అది చదివిన వాళ్లమ్మగారు పెదవి విరిచేసి, "మొగుడూ – పెళ్ళామూ కీచులాట ఏమంత బాగులేదు. దేశంలో స్వాతంత్ర్యం యజ్ఞం జరుగుతోంది. ఈ మహాసంగ్రామం పూర్వరంగంగా మలచి నవల చిత్రించి ఉంటే బాగుండేది. నవలకు కొంత విలువ ఉండేది. ఇప్పటి రూపంలో నవల అతి సామాన్యంగా ఉంది" అనేశారట. వారి పినతల్లులూ ఆమెతో ఏకీభవించారట. దానితో లక్షణరావుగారు చాలా నిరుత్సాహపడిపోయి, రెండురోజులు అన్నం కూడా తినలేకపోయి, బెజవాడకి రాసి, ప్రచురణ ఆపుచేయించి మళ్ళీ కొత్తగా వాళ్ళమ్మగారి విమర్శను దృష్టిలో ఉంచుకొని అనేకచోట్ల బాగా మార్చి తిరగ రాసారట. విమర్శ అంటే అంత నిష్పక్షపాతంగా ఉండాలి. సహృదయుడైన రచయిత అంటే లక్ష్మణరావులా ఉండాలి. ఆ రోజుల్లో లక్ష్మణరావుగారి అక్కయ్యగారిని ఆరవ తరగతివరకూ చదివించడానికే వాళ్ళ నాన్నగారి పట్టుదల తెలిసిన వాళ్ళ

©SCERT not to be republished

తాతగారు –కాలేజీ కమిటీ వారితో హోరాహోరీ పోరాడవలసివచ్చిందంట. చివరకి ఏడోతరగతి మధ్యలో ఆమె చదువు ఆపేయాల్సివచ్చింది. ఇప్పుడు బయటివారి అభ్యంతరం లేకున్నా వారి తాతగారిలా, తండ్రిగారిలా ఆలోచించగల వారెంతమంది ఉన్నారు చెప్పండి?

ఆ తాతగారు తాము ఆస్తికులైఉండి హేతువాద గ్రంథాలు కుటుంబంలోని స్త్రీలతో సహా ప్రతిఒక్కరికీ, ప్రతి రోజూ, ఒకపనిగా పెట్టుకుని చదివి విన్పించేవారట. ఆనాటి స్త్రీల పత్రికలు స్త్రీలకు పిండివంటలూ, ఫేషన్లు, నీతులూ నేర్పి ఊరుకొనే నేటి పత్రికల్లా కాక స్త్రీల అభ్యుదయంకోసం నిజంగా పాటుపడేవారి చేతులమీదుగా వెలువడేవి కాబట్టి వాటిని విరివిగా తెప్పించి వినిపించిన ఆ తాతగారి సౌజన్యాన్ని ఎంతైనా మెచ్చవచ్చు. పైగా “తాతగారూ మీరసలు దేవుణ్ణి చూశారా?” అని అడిగిన పసివాడైన మనవణ్ణి కసరకుండా ఎంతో హాయిగా ‘నేను చూడలేదురా? ఉన్నాడో లేడో చెప్పలేను. కష్టాలు పంచుకొనేవాడొకడున్నాడనుకుంటే బావుంటుంది కదా! అందుకని ప్రార్థిస్తున్నాను.” అన్నారట. అదీ శిశువు ముందు శిరసొగ్గే నిరహంకారమంటే ! ఇక కరుణగల విజ్ఞానం ఈ పుస్తకం నిండా వెన్నెలలా వెల్లివిరుస్తుందనే చెప్పాలి.

మెల్లిని లక్ష్మణరావుగారు మొదట చూసింది కరుణగల విజ్ఞానిగానే! మెడిసిన్ చదివే ఆ ఇరవైనాలుగేళ్ళ యువతి పాలమీగడలాంటి తెల్లని ఫ్రాకులో విందుకు వెళ్తూ దారిలో పెంటబండిని ఈడ్వలేకపోతున్న వృద్ధుని అగచాట్లు చూసి సహించలేక బండిని వెనకనుంచి తోసి సహాయపడి విందుకు ఆ నల్లని మరకలతోనే ఆలస్యంగా వెళ్తూ నిస్సంకోచంగా పాల్గొనడం ఆ దారినే ఆ విందుకే వెళ్ళిన లక్ష్మణరావుగారు చూడడం జరిగింది.

ఆ తర్వాత లక్ష్మణరావుగారు, మెల్లీ పద్నాలుగు సంవత్సరాల స్నేహంలో అన్ని కోణాలనుంచి ఒకరినొకరు అర్థం చేసుకున్నాక నిర్ణయించుకొని పరస్పరం కొన్ని షరతులు విధించుకుని వివాహం చేసుకున్నారట. మెల్లీ వంటి ఆత్మసౌందర్యమూర్తిని మాత్రమే ఆరాధించగల లక్ష్మణరావుగారు తమ సహజీవనంలో ఆమెపై ఎటువంటి నిర్బంధాలను పెట్టగలడు ?

సరే! ఇక ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటుంది. లక్ష్మణరావుగారిని కరుణగల విజ్ఞానులలో మొదటి వరుసలో పెట్టేందుకు.



జర్మనీలోని గ్రైఫ్సువాల్టు యూనివర్సిటీ నుంచి తన ప్రియమైన బోటనీలో పరిశోధనావకాశాలు శాశ్వతంగా వదిలేసుకుని తిరిగి వచ్చినప్పటి ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా పఠించదగ్గవి. "కొన్ని వేలు ఖర్చు పెట్టి జరిపిన నా పరిశోధన దేశానికి ఉపయోగకారిగా ఉంటుందనే నమ్మకం లేదు.. దేశపు తిండిగింజల సమస్య తీర్చని పరిశోధనలెందుకు?... ఒక వేళ ఉపయోగపడినా ఆ ఫలితాలను వినియోగించేందుకు విస్తీర్ణమైన పొలాలు మనకు లభిస్తాయా? ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిశోధనలు భూస్వాములకో ధనిక రైతులకో ఉపయోగపడవచ్చుగాని సామాన్యునికి ఉపకరిస్తాయా? సోషలిస్టు సమాజ స్థాపన తరువాతే భౌతికశాస్త్ర సాంకేతిక పరిశోధనలవల్ల కలిగే లాభం సమాజానికి, పేదప్రజలకీ ఉపకరిస్తుంది... ఇలా తమలో తాము విపరీతంగా తర్కించుకొని ప్రాణప్రదమైన బోటనీ పరిశోధనలకు స్వస్తిచెప్పి ప్రగతి ప్రచురణాలయంలో అనువాదకవృత్తిని చేపట్టారు. ఈ నిర్ణయాలన్నీ ఆయన నిశ్శబ్దంగా చేసుకున్నారే గాని అందుకు ఆయన ఆవేదన పడిపోలేదు. ఆవేశపడిపోతూ ప్రచారమూ చేసుకోలేదు. అయితే ఈ నిశ్శబ్దమైన నిర్మలమైన ప్రవర్తన వెనుక అకుంఠితమైన దీక్ష ఉంది. లక్ష్మణరావు చూపిన విజ్ఞత ప్రపంచంపట్ల ఆయన చూపిన బాధ్యత ఎన్నటికీ విస్మరింపరానిది.

మెల్లీ సాహసానికి మారుపేరు. తనవంటివారికి అవమానమో, ఒక మంచిపనికి అవరోధమో కలిగితే ఆమె అర క్షణం ఓర్వదు. ఆ మొండిపట్టు మంకుపట్టు గాదు. ఒకసారి రాజోలు నుంచి నర్సాపురం తిరిగి వెళ్ళేందుకు లాంచి ఎక్కిన తర్వాత ఎవరో పెద్ద అధికార్ల కోసం లాంచీని ఆపేసారట. మెల్లీ ఆ కటిక అమావాస్యనాటి సాయంకాలంలో స్విమ్మింగు కాస్ట్యూమ్స్ తో అమాంతం గోదావరిలోకి దూకేసి ఐదుగంటలపాటు పదిహేను మైళ్ళదూరం ఆ చీకట్లో ఈదేసి నర్సాపురం చేరుకున్నారు.

అలాగే గాంధీజీ ఎరవాడ జైల్లో ఉన్నపుడు సబర్మతి ఆశ్రమంలో వీరు గడిపినపుడు స్త్రీలకు గస్తీ నిషేధించడం సహించలేక సత్యాగ్రహం ప్రారంభించిందట. విషయం తెలిసి గాంధీజీ వద్దకు వెళ్ళి తన గస్తీని అంగీకరించకపోతే రాత్రివేళ గేటుదూకి గస్తీ తిరుగుతానని, ఏ శిక్ష విధించినా బద్ధురాలిననీ తెలియజేసిందంట. అప్పుడు స్త్రీలను కూడా గస్తీకి అర్హులేనని అంగీకరించటం జరిగిందట.

ఓసారి తూర్పుగోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా అప్పుడు పనిచేస్తున్న ముస్తాఫా అలీఖాన్ ఖాదీ ప్రదర్శనల్లో పాల్గొనవద్దని ఆమెని హెచ్చరిస్తే "అది నిషిద్ధమని జీ.వో లేదు. నన్ను నిరోధిస్తే స్విట్జర్లాండ్ దేశస్థురాలైన నేను మా రాయబారికి ఫిర్యాదు చేస్తాను. ఇది అంతర్జాతీయ సమస్యగా మారుతుంది. జాగ్రత్త !" అని అతడినే బెదిరించి వచ్చిందట.

**ఉప్పల లక్ష్మణరావు :**

1898 ఆగష్టు 11న బరంపురంలో జన్మించారు. కలకత్తాలో బి.ఎస్.సి. వృక్షశాస్త్రం చదివి, పై చదువుల కోసం ఎడింబర్, జర్మనీకి వెళ్ళి వృక్షశాస్త్ర పరిశోధనలో డాక్టర్ ఆఫ్ సైన్స్ పూర్తిచేశారు. కాకినాడ కళాశాలలో, అలీఘడ్ యూనివర్సిటీలో అధ్యాపకులుగా పనిచేశారు. "ప్రాచీన భారతంలో బానిసలు" అనే రచనను జర్మనీనుండి తెలుగులోకి అనువాదం చేశారు. 'అతడు – ఆమె' నవలతో ప్రసిద్ధులయ్యారు. 'బతుకు పుస్తకం' వీరి ఆత్మకథ. ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికగా వెలువడినప్పుడే ఇది ఎందరినో ఆకర్షించింది. రాసిన రెండు పుస్తకాలతోనే సాహిత్యంలో శాశ్వతస్థాన సంపాదించుకున్నారు. సాంఘిక, రాజకీయ, విద్యా, పారిశ్రామిక రంగాలలోనూ సేవచేశారు.

© SCERT not to be republished

స్వాతంత్ర్యోద్యమకారిణిగా ఆమె మూడున్నర సంవత్సరాలు జైలులోనే గడిపిందట. జైల్లో స్త్రీలకు మరుగుదొడ్ల సౌకర్యం కోసం నిరాహారదీక్షపూని సాధించిందట.

ఇంతటి దుందుడుకు స్వభావంగలదనిపించే ఆమె ముఖ్య విషయాలలో ఎంతో నిదానం చూపిస్తుంది. లక్ష్మణరావుగారి సూచన ప్రకారం ఆమె ఆయనను వివాహం చేసుకోడానికి ముందు ఏడు సంవత్సరాలు ఇండియాలో గడిపి, మన దేశ స్వాంతంత్ర్యంకోసం, మన దేశ ప్రజల వివిధరంగాల పురోగమనంకోసం స్నేహపూర్వకంగా, తాదాత్మ్యంతో పాటుపడి తన నిర్ణయాన్ని బలపరుచుకొని మరీ వివాహం చేసుకున్నదట ఆయన్ని. (మెల్లీది దుస్సాహసం అని ఆమె గోదావరికి అడ్డుపడి ఈదినప్పుడు బాధపడిన లక్ష్మణరావుగారు మాత్రం ఆమెకు అవమానం జరిగితే సహిస్తారనా?)

బెజవాడ సిమెంటు కంపెనీ కొత్త మేనేజింగ్ డైరెక్టరు నారాయణ గణపతిరాజుగారొకసారి లక్ష్మణరావుగారు తయారు చేసి తెచ్చిన స్టాకిస్టుల జాబితాలో తనకిష్టులైన వారికి హెచ్చుకోటాలు పడలేదనే కోపంతో కాగితాన్ని కింద పడేస్తే "అయ్యా ! దాన్ని ముందు తీసి బల్లమీద పెడతారా? నన్నిప్పుడే రాజీనామా ఇచ్చి పొమ్మంటారా?" అని అడిగారట. అడుగడుగునా వారు చూపిన సాహసాలకి, సాధించిన విజయాలకీ ఆశ్చర్యంతో పాటు అసూయకూడా కలుగుతుంది.

అందుకే ఈ శతాబ్దపు మన దేశచరిత్రకు అద్దం పట్టిన లక్ష్మణరావుగారి 'బతుకు పుస్తకాన్ని' ప్రతి ఒక్కరూ చదవాలని నేను సవినయంగా కోరుకునేది.

© SCERT not to be republished

## రచయిత్రి పరిచయం



సావిత్రిగారు రాజమండ్రి దగ్గర ఉండేశ్వరపురంలో 18.05.1949 లో జన్మించారు. డిగ్రీ మొదటిసంవత్సరంలో చదువు అర్థాంతరంగా ఆగిపోయినా సాహిత్య పఠనాభిలాషను కొనసాగించి అనేక కవితలు, కథలు,వ్యాసాలు, సమీక్షలు రాసి స్త్రీవాద సాహిత్యంలో తనదైన స్థానం సంపాదించుకున్నారు. 1991లో వీరి మరణానంతరం ఆమె రచనలన్నీ అరణ్యకృష్ణ సంపాదకత్వంలో "సావిత్రి" పేరుతో వెలువడ్డాయి. వీరి '.బందిపోట్లు" కవిత ప్రసిద్ధమైంది. ప్రగతిశీల దృక్పథం, రాజీలేని పోరాటమనస్తత్వం పదునైన భావావేశం ఈ రచయిత్రి ప్రత్యేకత.

### ప్రక్రియ - పుస్తక పరిచయం

ఏదైనా ఒక పుస్తకాన్ని సమగ్రంగా చదివి, అందులోని విషయాల్ని సంక్షిప్తంగా పరిచయం చేస్తూ, గుణదోషాల్ని తెలియజేయడమే పుస్తక పరిచయం అంటారు. ఇది చదవగానే ఆ పుస్తకంమీద ప్రాథమిక అవగాహన, చదవాలనే ఆసక్తి కలుగుతాయి.

## ఇవి చేయండి

## I అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది అంశాల ఆధారంగా మాట్లాడండి.**

1. ఉప్పల లక్షణరావుగారు రాసిన మరో పుస్తకం ఏది? ఆ పుస్తకంపై సమీక్షకురాలి స్పందన ఏమిటి?
2. కవులు, రచయితలు రాసిన పుస్తకాలను అందరికీ పరిచయం చేయడానికి పుస్తకావిష్కరణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఏం చేస్తారో చెప్పండి.

**ఆ) పాఠ్యాంశం ఆధారంగా కింది మాటలను ఏ సందర్భంలో ఎవరు అన్నారో రాయండి.**

1. 'అదీ శిశువుముందు శిరసొగ్గే నిరహంకారమంటే!'.
2. ఈ నిశ్శబ్దమైన నిర్మలమైన ప్రవర్తనవెనుక అకుంఠితమైన దీక్ష వుంది.
3. నిజాయితీ గల సాహితీ మూర్తుల ఆవిర్భావం ఒక చారిత్రక అవసరం అనే చెప్పాలి.
4. దేశపు తిండి గింజల సమస్య తీర్చని పరిశోధనలెందుకు?
5. "ఇది అంతర్జాతీయ సమస్యగా మారుతుంది. జాగ్రత్త!"

**ఇ) పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| పేరు | వివరాలు | స్వభావం |
|---|---|---|
| ఉప్పల లక్ష్మణరావు | | |
| మెల్లీ | | |
| లక్ష్మణరావుగారి తాతగారు | | |
| లక్ష్మణరావుగారి తల్లి | | |

**ఈ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. రచయిత ఈ పాఠం ద్వారా ఏ పుస్తకం గురించి పరిచయం చేసింది?
2. మెల్లీ దుందుడుకు స్వభావానికి చెందిన సంఘటనలు తెల్పండి?
3. గ్రంథాలు, పుస్తకాలు ఎలా ఉండాలని రచయిత్రి తెలియజేసింది?
4. లక్ష్మణరావు గారు పరిశోధనరంగం నుంచి రచనారంగంవైపు ఎందుకు మారారు?

## II వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. సమాజానికి ఎటువంటి రచయితల అవసరం ఉంది?
2. "లక్ష్మణరావు గారి విజ్ఞత, ప్రపంచంపట్ల ఆయన చూపిన బాధ్యత ఎప్పటికీ విస్మరింపరానిది" అని సావిత్రి గారు అనడం సరైందేనని మీరు భావిస్తున్నారా? ఎందుకు?
3. హేతువాదులు ప్రశ్నించే విషయాలు ఎలాంటివై ఉంటాయి?
4. కరుణగల విజ్ఞానం అంటే ఏమిటి? కరుణ కలిగినవారు చేసే పనులు ఏమై ఉంటాయి?
5. పరిశోధనలు ఎందుకు చేస్తారు? దీనివల్ల ఎవరికి మేలు జరగాలి? ఏ ఏ పరిశోధనలు సమాజానికి మేలు చేస్తాయి?

© SCERT not to be republished

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. ఈ పాఠం ఆధారంగా 'బతుకుపుస్తకం'లోని అంశాలను పదివాక్యాల్లో రాయండి.
2. బతుకు పుస్తకంలో కరుణ గల విజ్ఞానానికి సంబంధించిన సంఘటనలు ఉన్నాయి కదా! వాటిలోంచి ఏదైనా ఒక సంఘటనను విశ్లేషించండి.
3. సావిత్రిగారి బతుకుపుస్తకం గురించి పరిచయం చేసిన విధానం ఏ విధంగా ఉంది?

**ఇ) పాఠంలోని ఐదవ పేరాను చదవండి. ఆ పేరాలోని విషయాన్ని మూడు లేదా నాలుగు వాక్యాలుగా సంక్షిప్తీకరించి రాయండి. ప్రదర్శించండి.**

**ఈ) సృజనాత్మకంగా రాయండి.**

ఈ పాఠం ఆధారంగా మీకునచ్చిన ఏదైనా కథ, గేయం, కవితల పుస్తకం గురించి పరిచయం చేయండి.

లేదా

మీ తొమ్మిదో తరగతి "తెలుగుదివ్వెలు - 1" పాఠ్య పుస్తకం గురించి పుస్తక పరిచయ నివేదికను, మీ అభిప్రాయాలను రాయండి.

**ఉ) ప్రశంసాత్మకంగా రాయండి.**

మీ తరగతిలో మీ మిత్రులు రాసిన పుస్తక పరిచయ నివేదికలలో ఎవరి నివేదిక బాగా ఉంది? అది ఎందుకు బాగా ఉందో వివరిస్తూ, వారిని ప్రశంసిస్తూ పది వాక్యాలు రాయండి.

## III భాషాంశాలు

### పదజాలం

**అ) పాఠం ఆధారంగా ఈ కింది ఖాళీలను పూరించండి.**

1. ఉప్పల లక్ష్మణరావు బతుకుపుస్తకం కంటే ముందుగా సావిత్రి చదివిన పుస్తకం ............
2. లక్ష్మణరావు తల్లిగారి.................. దృష్టిలో వుంచుకొని నవల తిరిగిరాశారట
3. ఆనాటి స్త్రీల పత్రికలు .................. పాటుపడేవారి చేతులు మీదుగా వెలువడేవి.
4. మెల్లీ .................... లో సత్యాగ్రహం ప్రారంభించిందట.
5. లక్ష్మణరావు గారు జర్మనీ నుంచి తన ...................... శాశ్వతంగా వదలి వేసుకొని రచనారంగంవైపు మారారు.

**ఆ) గీతగీసిన పదాలకు అర్థాలను గుర్తించండి. ఆ అర్థంతో మరొక కొత్తవాక్యం రాయండి.**

1. నాలో పేరుకుపోయిన నీరసం <u>పటాపంచలై</u> పోయింది. ( )

ఎ) ఎక్కువ బి) తక్కువ సి) చెల్లాచెదురు డి) ముక్కలుముక్కలు

© SCERT not to be republished

2. మన దేశచరిత్రకు అద్దంపట్టిన పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలి ( )

ఎ) పొగిడిన బి) గొప్పదనాన్ని సి) ప్రతిబింబించిన డి) సంక్షిప్తంచేసిన

3. నిరుత్సాహికి ఉత్సాహాన్నీ, రికామికి బాధ్యతనీ అందించగలగాలి పుస్తకం ( )

ఎ చురుకైన బి) పనిలేనివాడు సి) తెలివైనవాడు డి) అజ్ఞాని

**ఇ) కింది పదాలను వివరించండి. సొంత వాక్యాలు రాయండి.**

1. పఠించతగిన :______________________________
2. గొప్ప నిదర్శనం :______________________________
3. అకుంఠితమైన దీక్ష :______________________________

## వ్యాకరణం

**అ) కిందివాటిని జతపరచండి.**

| | | |
|---|---|---|
| 1. వాటిని ఇనప్పెట్టెలో పెట్టి తాళాలు వేసి | ( ) | అ) చేదర్థకం |
| 2. కాపలాకాస్తూ హాయిగా తిని కూర్చో | ( ) | ఆ) శత్రర్థకం |
| 3. మానసికంగా ఎదిగినట్లైతే | ( ) | ఇ) ప్రశ్నార్థకం |
| 4. నిర్భయంగా జీవించాలని ఆశించడం తప్పా? | ( ) | ఈ క్త్వార్థకం |

**ఆ) పరోక్ష కథనంలోకి మార్చండి**

1. "ఇది అంతర్జాతీయ సమస్యగా మారుతుంది. జాగ్రత్త!" అని అతడినే బెదిరించింది మెల్లీ.
2. "చిన్నప్పటినుండి నాకు బోటనీ అభిమాన విషయం" అన్నాడు రచయిత.

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

మీ పాఠశాల గ్రంథాలయంలోని రెండుమూడు పుస్తకాల్లోని ముందుమాటలు చదవండి. ఆ పుస్తకాల గురించి మీరు తెలుసుకున్న విషయాలను రాసి ప్రదర్శించండి.

(లేదా)

సావిత్రి 'బందిపోట్లు' కవితను సేకరించండి. దీనిపై మీ అభిప్రాయం రాసి ప్రదర్శించండి.

మంచి పుస్తకం మంచి మనసుకు మరో పేరు.
సొంత పుస్తకం మంచి మనిషికి మరో తోడు.
- ఇరివెంటికృష్ణమూర్తి